# మళ్ళీ మనుష్య ధోరణిలో

## సుందరరావు

ఆఫీసునుండి ఇంటికి రాగానే గుమ్మం దగ్గర రెండు ఉత్తరాలు పడిఉన్నాయి. గబగబా ఆ రెండు కవర్లనీ తీసి పై ఎడ్రెస్సుల్ని చూసేను ఒకటి శ్రీమతిగారి వంకర టింకర రైటింగూ, రెండోది నాకు ఎప్పుడో పరిచితమైన వ్రాతానూ. తొందరతో శ్రీమతి వారి ఉత్తరాన్ని విప్పి చూసేను. ఉత్తరం అంతా ఏదో సోదచెపుతూ వ్రాసిందే పూర్తిగా చదివి జాగర్తగా పాత ఉత్తరాల ఫైల్లో జేర్చాను (లేకుంటే ఆమెగారు మళ్ళీ వచ్చినపుడు చూస్తే అన్నీ వరసలో లేకపోతే ఏం దెబ్బలాడుతుందోనన్న భయం.) రెండో కవరు చింపకపూర్వం ఎవరు వ్రాసి ఉంటారా అని కొంచెంసే పాలోచించాను. ఈ తెలివైన బుఱ్ఱకేమీ జ్ఞాపకంరాలేదు. విసుగుతో కవరిప్పి చూసేను. నాకే ఆశ్చర్యం వేసింది. పచ్చటి ఉల్లిపొర కాగితం మీద వణుకుతూన్న చేతితో ముక్తసరిగా మూడే పంక్తులు.

"అభాగ్యుణ్ణి, గతించినదాన్ని మరిచిపోయి నువ్వు నన్ను క్షమిస్తేకాని మనశ్శాంతితో కళ్లు మూయలేను. వీలవుతే ఆఖరుమాటు నన్నొకసారి చూడ్డానికొస్తావనుకొంటూ. — కేశవరావు." నాకు తెలియకుండానే కళ్ళమ్మట నీళ్లువచ్చేయి. వాడు నన్ను జ్ఞాపకం పెట్టుకొని రమ్మని వ్రాసినందుకెంత సంతోషం వచ్చిందో! నాలుగురోజుల్లో శెలవులిస్తారు, వెంటనే బయలుదేరుదామనుకొన్నా. వెళ్తూన్నపుడు శ్రీమతిగారికి శెలవల్లో అత్తవారింటికి రాలేనని, మన్నించమని కోరుతూ వ్రాసి మరీ బయలుదేరేను.

* * *

రైల్లో కూర్చున్నది మొదలు చిన్నప్పటి మా ఇద్దరి స్నేహమూ ఆడిన ఆటలూ అన్నీ జ్ఞాపకం వస్తూన్నాయి.

కేశవరావూ నేనూ ఎప్పుడు కలుసుకొన్నామో జ్ఞాపకంలేదు కాని మొదటి ఫారం దగ్గరినుంచీ సహాధ్యాయులం - ఇద్దరం జతగా తిరిగేవాళ్లం. వాళ్ల పెద్ద మేడలో ఆడుకోవడమూ, జాజి పందిరెక్కి కద్దమూ, దొంగాటలో వాడు వాళ్ల నాన్నగారి గదిలోకెళ్లి నక్కుంటే- నేను రోజల్లా శ్రమపడి ఏడుపు మొహంవేసి ఇంటికి పోవడమూ అన్నీ మళ్లీ జరిగినట్టే మనస్సుకి తట్టుతూన్నాయి.

స్కూలు ఫైనలు పాసవగానే వాడిని మెడ్రాసు పంపారు. నేను మావూరు కాలేజీలో చేరేను. అప్పటినుంచి దూరమయాము. శెలవుల్లో వచ్చినప్పుడు మాత్రం కలిసి రోడ్డమీద తిరిగేవాళ్లం పనీ పాటూ లేక. కొంతకాలమయ్యాక అదీ తగ్గిపోయింది. అతడు ధనవంతుడు. నన్ను ఎల్లప్పుడూ జ్ఞాపకం పెట్టుకోవల్సిన అవసరం నాకు కనపడలేదు. పట్నంలో ఎంతోమంది కొత్త స్నేహితుల్ని సంపాదించి ఉంటాడు. నేను జ్ఞాపకం ఉంటానో ఉండనో ఇలా ఎన్నోవిధాల ఆలోచించేవాణ్ణి ఎప్పుడూను.

ఆ నాలుగేళ్లూ నేను మా వూరు కాలేజీలోనే చదివాను. కేశవరావు ఇంటికి మొదటేడులో రెండు మూడుసార్లు వచ్చేడు. ఆ తరువాత వాళ్ల నాన్నగారూ అమ్మగారూ కూడా మద్రాసు వెళ్లిపోయారు కొడుకుని సుఖంగా చదివించాలని. ధనవంతులు!

కాలేజీ చదువయ్యాక నేను బెనారసు వెళ్లిపోవడం వల్ల అతని గురించి ఏమీ తెలియనే లేదు. అలా కాలం గడిచిపోతూంది.

ఒక ఏడాది శెలవుల్లో ఇంటికి వెళ్లినప్పుడు ఎవరో చెప్పేరు, కేశవరావుకి పెళ్ళయిందని. ఆ మరుసటి సంవత్సరం వాడి తల్లిదండ్రులు చనిపోయారని. వెంటనే ఓదారుస్తూ ఒక వుత్తరం వ్రాసేను. జవాబు వ్రాస్తాడన్న ఆశతో. వారాలూ, నెలలూ...ఏమీ రాయలేదు. ఎడ్రెసు తప్పు వ్రాసేనేమో అని వూరుకొన్నా.

కాలం క్రమంగా దొర్లింది. నా చదువైపోయింది. తిరగ్గా తిరగ్గా ఓ చిన్న ఉద్యోగం కూడా దొరికింది. పనిలో చేరేముందర ఇంటి

గొడవలకోసం చెన్నపట్నం వెళ్లేను. నా పనులు అన్నీ చూసేసుకొన్నాక, కేశవరావుని ఒక్కసారి చూద్దామనిపించి వాడి ఇల్లుకోసం వెతకడం మొదలుపెట్టేను. ఆఖరుకి అది ఎక్కడుందో తెలుసుకోవడానికి నానా కష్టమూ అయిపోయింది. ఇంట్లోకి వెళ్ళగానే చిన్నప్పటినుంచీ ఉన్న నౌఖరు రామన్న కనపడ్డాడు. వాడిని అడిగేను కేశవరావెలా ఉన్నాడు? ఏం చేస్తూన్నాడూ? —అని. వాడి కంఠంతో కేశవన్నా నేనన్నా పితృవాత్సల్యం కళ్లమ్మట నీళ్లు పెట్టుకొని కేశవరావు చెడిపోతున్నాడని చెప్పేడు. అతికష్టంమీద ఇంట్లో చాలాకొద్ది సేపుంటున్నాడుట. కొన్ని రాత్రుల్లు ఇంటికే రావడం మానేస్తున్నాడుట... దుఃఖంతో నోటి నుంచి మాటలు రావటంలేదు. ఇంక చెప్పలేక పోయాడు. నేను గ్రహించేను. ధనంవల్ల అబ్బే చెడు లక్షణాలన్నీ వాణ్ణి వరించి ఉంటాయనీ, వాడి కూతుర్నీ భార్యనీ చూద్దామనీ, ఎక్కడున్నారని రామన్న నడిగేను. వాడు ఏడుస్తూ ఏదో చెప్పబోయేలోపుగా-బయట కారు హారన్ చప్పుడు వినపడ్డంవల్ల లోపల కెళ్లిపోయాడు. నేను ఎదురుచూస్తూ కుర్చీలో కూలబడ్డాను. ఇంతలో పోల్చుకోలేని రూపంతో వాడూ ఆతని కాసరాగా ఒక సుందర యువతీ లోపలి కొచ్చేరు. వాణ్ణి చూడగానే నాకు లోపల ఉన్నండి ఏడుపు వచ్చి పలకరించలేకపోయాను. కళ్లల్లో నీళ్లు కమ్ముకోవడంవల్ల అంతా అలుముకొనిపోయి వాడి స్థానంలో నాతో చిన్నప్పుడు ఆడుకొనే కుర్రాడుగా ఉండే రూపు కనపడింది. ఇద్దరమూ అలా ఒకర్నొకరం చూసుకొంటూ ఎదురెదురుగా కూర్చుండిపోతే, రామన్న వచ్చి ఆమె ఎవరో చెప్పేడు. ఒక్కసారి వాడి మొహమంతా సిగ్గుతో తెల్లగా అయిపోయింది. పోల్చలేకపోయినందుకేమో అనుకోవద్దని, క్షమాపణ పూర్వకంగా అన్నాడు. ఫరవాలేదని, నాలుగు మాటలు మాట్లాడడానికి వీలవుతుందా అని అడిగేను. వాడు తలవూపే ముందరే "ఆయనకి పూర్తి విశ్రాంతి ఉండాలని డాక్టరు చెప్పేరండీ. కేశవ్ నువ్వు పడుకొని నిద్రోవాలి" అని వాణ్ణి రెండు చేతుల్తోనూ ఒకబొమ్మలా లేవదీసింది ఆవిడ. వాడేమో అనబోయాడు కాని ఇంతలోనే ఆ వగలాడి లోపలికి నడిపించుకుపోయింది. నేను వచ్చేస్తూ రామన్నకి నా ఎడ్రసు ఇచ్చి అప్పుడప్పుడు ఉత్తరాలు వ్రాస్తూండమని చెప్పి వచ్చేసాను. ఆ తరువాత వాడిసంగతేమీ తెలియలేదు. వచ్చేసిన కొత్తరోజుల్లో ఆ యువతెవరో, భార్యా, కూతురూ ఎక్కడున్నారో తెలుసుకోవాలని ఉండేది. కాని వీలు పడలేదు.

నాటికి నేడు వాడి దగ్గరనుంచి రమ్మని ఉత్తరం వస్తే నాకెంత సంతోషం వచ్చిందో! శలవలు ఇవ్వడానికింకా నాలుగురోజులున్నా మర్నాడే బయలుదేరాను చెన్నపట్నానికి. వెళ్తూన్నంతసేపు కేశవరావు ఈపాటికి మామూలు మనిషి అవుతాడనీ, కూతురు పెద్దదై చదువుకుంటూంటుందనీ... ఎన్నో ఆలోచనలు నా బుర్రలో పరుగెడుతూన్నాయి.

ఇంటికి వెళ్లేటప్పటికి రామన్న లేడు. ఇల్లాలూ, కూతురూ లేరు.

లోపల ఒక గదిలో శల్యంలాంటి రూపుతో మంచంమీద పడుకొని, మూల్గుతూన్నాడు. పక్కని ఒక మొగనర్సు కాబోలు సేవలు చేస్తూన్నాడు. వాడి మంచంమీద కూర్చున్నా అలాగ వాడికేసి చూస్తూ. నాకేం మాట్లాడాలో తెలియలేదు. వాడూ కొంచెం సేపయ్యేదాకా అలా చూస్తూ ఉండిపోయాడు. అతి ప్రయత్నంమీద మెల్లగా "నన్ను క్షమించి ఆఖరుసారి చూడ్డానికి వచ్చేవా" అన్నాడు. అలాంటి వెర్రిమాటలాడవద్దని చెప్పి పడుకోమని ఇవతలి కొచ్చేసేను. ఆ వేళనుండీ నేనే స్వయంగా సపర్యలు చేయడంవల్ల ఒక వారం పదిరోజుల్లో కొంచెం ఆరోగ్యం చేరింది వాడిలో. ఆ నెల తిరిగేటప్పటికి తిరగడానికి వీలయ్యే శక్తి చేకూరింది. మళ్లీ మామూలు మనిషిలాగయ్యాడు. ఎంతసేపూ అన్నింటిగురించీ మాట్లాడుకొనేవాళ్లం కాని వాడి భార్యను గురించైనా కూతురును గురించైనా మాటవచ్చేసరికి ఏడుపుతో గాని మాట్లాడేవాడు కాదు. దాన్ని చూచి నేను కూడా తరచి తరచి ఇంక అడగలేదు.

మెల్లిగా శక్తి చేకూరగానే, మనశ్శాంతి కోసం దక్షిణ దేశం చూసొద్దామని కోరిక పుట్టి, వాడితో అన్నాను. వాడూ ఇష్టమే వెళ్దామన్నాడు.

మధుర, చిదంబరం, తిరువనంతపురం ఎన్నెన్నో తిరిగేం. సుచీంద్రంలో ఆఖరుకు ఉండబట్టలేక, తాగి వళ్లు తెలియని సమయంలో పెళ్లామూ, కూతురూ కూర్చున్న కారుని ఓ చెట్టుకి ఢీకొట్టించడంవల్ల, చేతులారా తనంతట తనే చంపుకొన్నానని చెప్పి చంటిపిల్లవాడిలా ఏడిచేడు. లోపల లోపల విచారంతో కృంగిపోతూన్న హృదయంలోని విచారం అంతా ఒక్కసారి బయట పడేలాగ.

ఏడ్చిఏడ్చి నిద్రోయాడు శోషవచ్చి. నేను ఆలోచిస్తూ అలాగే కూర్చుండి పోయాను.

కన్యాకుమారి వచ్చేం. మనస్సులో ఏం తోచిందో! అక్కడే ఉండిపోతా నన్నాడు. ఆ సుందర సముద్ర కెరటాలు ఇసుకతో రాసిడి పెట్టడంలో, ఆ మధుర దృశ్యాల అమరత్వంలో ఏ మహత్తుందో కాని ఆ చోటు వాడి కెంతో నచ్చింది.

సముద్రపుటొడ్డున ఒక ఇల్లు కట్టుకొని అక్కడే ఉండిపోయాడు యావజ్జీవితమూను. నే నప్పుడప్పుడు అవూరు వెళ్లి వాణ్ణి చూస్తూంటా. ఇప్పుడు వాడు కొంచెం మనుష్య ధోరణిలో పడ్డాడు. కాని వాడి హృదయంలో భార్యకూ కూతురుకూ తాను చేసిన అపకారం యింకా బాధను కలుగచేస్తూనే ఉంటాయి.

దేశసేవ ఖరీదెంత?

# కాంగ్రెసువారి భూప్రదానాలు

వావిలాల గోపాలకృష్ణయ్య

రాజకీయ బాధితులకు భూప్రదానాలు అనే పేరుతో లేచిన ఆందోళన, పడే తాపత్రయం, మన రాజధానిలోని ప్రజలందరికీ విదితమే. అందులోనూ ఆంధ్రలో రాజకీయ బాధితులు తమ సేవాఫలాన్ని ఎకరాలు, సెంట్లలోకి మార్చుకుంటున్నారు. ఈ సదనులో రాష్ట్ర శాసనసభలోని కాంగ్రెస్ సభ్యులకు ముప్పైయిద్దరికి-రాజకీయ బాధితులనే పేరు క్రింద-భూములు ప్రదానం చేయబడినట్లు క్రిందటి నెల 24వ తేదీన శాసనసభలో ప్రకటింపబడింది.

అందులో పన్నెండుగురు ఆంధ్రులు; యిరవై మంది తమిళులు. ఇది అఖరు జాబితా అని తలచడానికి వీలులేదు. జెయిళ్ళకు వెళ్ళినందున సంపన్నులుకూడా భూములు తీసుకోవడంవల్ల, రాజకీయ బాధితులుగా కష్టకష్టాలు అనుభవించి, యీ నాటికీ కుటుంబాలు గడవనివారికి భూప్రదానం జరిగిన దనడానికి వీలులేదు. అంతే కాదు. అసలు త్యాగాలక్రింద భూములు తీసుకోవడం సరి అవునా, కాదా, అనేది అటుంచుదాం. కుటుంబాలు చితికిపోయినవారికి సహాయం చేస్తే ప్రజలు మన్నించ గలిగేవారేమో! కాని సంపన్నులే భూములు తీసుకోవడం (ఆ భూముల విలువ తెలియచెయ్యలేదు) రాజకీయ బాధితులనే పేరును దుర్వినియోగం చెయ్యడం అవుతుంది. ఇందులో ఆంధ్రసభ్యుల పేర్లను గమనించండి: శ్రీ ఆత్మకూరి గోవిందాచార్యులు (అయిదు ఎకరాల మూడు సెంట్లు); శ్రీ వేముల కూర్మయ్య (రెండు ఎకరాల యిరవై ఒక్క సెంట్లు; శ్రీమతి వల్లభనేని సీతామహాలక్ష్మమ్మ (పది ఎకరాలు); శ్రీ ఎ. అరుణారావు (నాలుగు ఎకరాల డెబ్భై రెండు సెంట్లు); శ్రీ పుట్టా సుబ్బయ్య (నాలుగు ఎకరాల డెబ్భై రెండు సెంట్లు); శ్రీ లేబూరి సుబ్బరామిరెడ్డి (మూడు ఎకరాల ఏభైనాలుగు సెంట్లు); శ్రీ నీలం సంజీవరెడ్డి (పదిహేను ఎకరాలు); శ్రీ కల్లూరి సుబ్బారావు (పదిహేను ఎకరాలు); శ్రీ జి. వెంకటరెడ్డి (పదిహేను ఎకరాలు); శ్రీ డి. కదిరప్ప (పదిహేను ఎకరాలు); శ్రీ నివర్తి వెంకట సుబ్బయ్య (పది ఎకరాల ఆరు సెంట్లు;) కీర్తిశేషులు శ్రీ టి.యన్. రామకృష్ణారెడ్డి (రెండెకరాలు).